నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌: కిష్టాపూర్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ సంబంధ మరమ్మతు పనుల కారణంగా కిష్టాపూర్‌ ఫీడర్‌ పరిధిలో గురువారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ ఉండదన్నారు. కిష్టాపూర్‌, అర్చన కాలనీ, వీకర్‌సెక్షన్స్‌, కిష్టాపూర్‌ క్వార్టర్స్‌, కాలనీలతో పాటు కిష్టాపూర్‌లోని అన్ని వ్యవసాయ కనెక్షన్‌లకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఘట్‌కేసర్‌ ఎస్‌ఐకి వీడ్కోలు


ఎస్‌ఐ రామునాయక్‌ను సత్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్‌ సైదులు

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఏడాదిగా సబ్‌ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన రామునాయక్‌ బాలాజీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇన్‌స్పెక్టర్‌ సైదులు ఆయనకు బుధవారం వీడ్కోలు పలికారు. పూలమాలతో ఘనంగా సత్కరించారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేద్దాం


శ్రీనివాస్‌నగర్‌లో మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో అందరి సహకారంతో వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం మున్సిపల్‌ పరిధిలోని 5వ వార్డులోని శ్రీనివాస్‌నగర్‌ కాలనీలో అవెన్యూ మొక్కలను నాటారు. ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేస్తున్న మొక్కలను ప్రతి ఒక్కరూ నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. వార్డు కౌన్సిలర్‌ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పండగ సాయన్న ముదిరాజ్‌కు నివాళి


సాయన్నకు నివాళులర్పిస్తున్న నవీన్‌, గణేశ్‌ తదితరులు

ఘట్‌కేసర్‌: అంకుషాపూర్‌ ముదిరాజ్‌ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజా వీరుడు, సామాజిక బహుజన ఉద్యమ నేత పండుగ సాయన్నముదిరాజ్‌ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి గేటు నవీన్‌ముదిరాజ్‌, ఉపాధ్యక్షుడు మేడబోయిన గణేశ్‌ముదిరాజ్‌ మాట్లాడుతూ... ప్రజలను దోచిన దొరల ఆస్తులను దోచి పేదలకు పంచిపెట్టారన్నారు. ఆనాటి నిరంకుశ నిజాంను ప్రశ్నించి, ఎదిరించారని, సొంత పాలన వ్యవస్థను ఏర్పాటు చేసుకొని సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించిన వీరుడన్నారు. సంఘం కార్యదర్శి గణేశ్‌ ముదిరాజ్‌, కోశాధికారి శ్రీనుముదిరాజ్‌, ఉపేందర్‌ ముదిరాజ్‌, అరుణ్‌ ముదిరాజ్‌, బాలి ముదిరాజ్‌, సాయికుమార్‌ ముదిరాజ్‌ పాల్గొన్నారు.

నియామకం



ఘట్‌కేసర్‌: కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ సెల్‌ మేడ్చల్‌ జిల్లా కన్వీనర్‌గా ఘట్‌కేసర్‌కు చెందిన మేకల దాసు నియమితులయ్యారు. కాంగ్రెస్‌ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌ జిల్లా అధ్యక్షుడు పత్తి కుమార్‌ తన కార్యాలయంలో బుధవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ... జిల్లాలోని ఎస్సీల అభ్యున్నతికి అన్నివిధాలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నేతలు బాల్‌రాజ్‌, రాజు, జగదీశ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన ట్రాఫిక్‌ ఏసీపీ


ఫ్లైఓవర్‌ వద్ద ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ హనుమాన్‌గౌడ్‌

మేడ్చల్‌: మేడ్చల్‌ మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌ నిర్మాణ పనులను మేడ్చల్‌ ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ హనుమాన్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల వల్ల రహదారిపై ఎక్కడెక్కడ ట్రాఫిక్‌ సమస్య తలెత్తుంది... నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాంట్రాక్టర్లు వాహనాలకు ఇబ్బందులు లేకుండా పనులు చేయాలని సూచించారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన పనుల గురించి మేడ్చల్‌ ట్రాఫిక్‌ పోలీసులకు వివరించారు.

సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం

గౌతంనగర్‌: సమష్టి కృషితోనే కాలనీ సమస్యలు పరిష్కరించవచ్చని బీఆర్‌ఎస్‌ నేతలు మేకల రాముయాదవ్‌ అన్నారు. వాణినగర్‌ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీధి నెంబర్ల సూచికల బోర్డును కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావులు మాట్లాడుతూ.. మొత్తం కాలనీలో 4 వీధులు ఉన్నాయని, మొత్తం వీధులకు 40 సూచికల బోర్డులను ఏర్పాటు చేశామని తెలిపారు.

వేడుకగా తొలి ఏకాదశి


ప్రత్యేక అలంకరణలో స్వామివారు


జయదర్శిని వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మేడ్చల్‌: సంవత్సరంలో అన్ని పండగలకు ప్రారంభంగా మొదట వచ్చే తొలి ఏకాదశి పండగను భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి శ్రీమన్నారాయుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లల్లో తొలిపండగ కావడంతో పసందైన విందులు చేసుకున్నారు. భక్తులు ఉపవాస దీక్షలతో పిండి వంటకాలతో పండగను వైభవంగా జరుపుకొన్నారు. వైష్ణవ ఆలయాల్లో వివిధ పూజలు నిర్వహించారు.

వైభవంగా తొలిఏకాదశి పూజలు

కీసర: తొలి ఏకాదశి సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర స్వామి, అహ్మద్‌గూడలోని ప్రజయి సాయి గార్డెన్‌లో ఉన్న త్రిమూర్తి ... త్యత్మక శ్రీరామాలయం, చీర్యాల శ్రీలక్ష్మీనృసింహ్మ స్వామి, నాగారంలోని వివిధ దేవాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గర్భాలయాల్లో కొలువైన స్వామి వార్లకు విశేష పూజలు, వివిధ పుష్పార్చన, మహా అర్చన తదితర పూజలను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శతకోటి నగర సంకీర్తన

శామీర్‌పేట్‌: మూడు చింతపల్లి మండలం లక్ష్మాపూర్‌లో తొలి ఏకాదశి సందర్భం గ్రామ భజన బృందం ఆధ్వర్యంలో హరేరామ హరేకృష్ణ శతకోటి నగర సంకీర్తనను బుధవారం నిర్వహించారు. పోచమ్మ బండ నుంచి గ్రామ వీధుల్లో భజనలు చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గ్రామంలోని మరకత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి అర్చనలు, అభిషేకలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు ఉపేందర్‌శర్మ, నాగరాజు శర్మ, భక్తులు పాల్గొన్నారు.


హరేరామ హరేకృష్ణ నగర సంకీర్తనలో భజన బృందం

రైల్వే వంతెన నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: పట్టణంలో పునఃప్రారంభమైన రైల్వే వంతెన పనులను మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ... వంతెన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ మల్లేశ్‌, కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్‌, రాధాకృష్ణ ముదిరాజ్‌, ఉపాధ్యక్షుడు నాగరాజు ముదిరాజ్‌, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు యాదవ్‌, యూత్‌ కాంగ్రెస్‌ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శివప్రదీప్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్‌, ఖయూమ్‌, సునీల్‌కుమార్‌, శ్రీనివాస్‌, శివ పాల్గొన్నారు.

ఐడీఎస్‌తో 'గీతాంజలి' అవగాహన ఒప్పందం


ఎంఓయూ మార్పిడిలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఉదయ్‌కుమార్‌, ఐడీఎస్‌ ప్రతినిధి సుబ్రహ్మణ్యం

కీసర: చీర్యాల గ్రామంలోని గీతాంజలి ఇంజినీరింగ్‌ కళాశాల, ఐడీఎస్‌ అప్‌లైడ్‌బ్లాక్‌ చెయిన్‌ సెంటర్‌ను స్థాపించేందుకు తమ భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందంపై కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఉదయ్‌కుమార్‌ ఐడీఎస్‌ బిజినెస్‌ ప్రతినిధి సునీల్‌సుబ్రహ్మణ్యం యడవల్లి సంతకాలు చేశారు. అనంతరం ఎంఓయూ మార్పిడి చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఉదయ్‌కుమార్‌ మాట్లాడుతూ... బ్లాక్‌ చెయిన్‌ టెక్నాలజీ రంగంలో అకడమిక్‌ ఎడ్యుకేషన్‌ రీసెర్చ్‌ని ప్రోత్సహించడం ఈ సహకారం లక్ష్యమన్నారు. దీని ద్వారా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి మరింతగా పెంపొందుతుందన్నారు. క్లిష్టమైన రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందన్నారు. ఐడీఎస్‌ ప్రతినిధి సుబ్రహ్మణ్యం యడవల్లి మాట్లాడుతూ... దేశంలో బ్లాక్‌ చెయిన్‌ టెక్నాలజీ వృద్ధికి ఐడీఎస్‌ కట్టుబడి ఉందన్నారు. అప్‌లైడ్‌ బ్లాక్‌చెయిన్‌ సెంటర్‌ విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించి భవిష్యత్తులో నిపుణులను అందిస్తుందన్నారు. స్కూల్‌ ఆఫ్‌ కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇన్ఫర్మేటిక్‌ డీన్‌ డాక్టర్‌ వి.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'కేదార్‌నాథ్‌ ఆలయ' నిర్మాణానికి భూమి పూజ


పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్‌...

మేడ్చల్‌రూరల్‌: ఎల్లంపేట్‌ గ్రామ పరిధిలో దక్షిణాది కేదార్‌నాథ్‌ ఆలయ నిర్మాణాలను బుధవారం భూమి పూజ నిర్వహించారు. కాశీ పీఠాధిపతి నరేంద్రనంద్‌ మహరాజ్‌, వారణాసి జగద్గురు శంకరాచార్య సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ నమూనా ఆలయ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజను వేడుకగా నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉత్తరాదిన మంచుకొండల్లో ఉండే కేదార్‌నాథుడిని దక్షిణాదిన ఎల్లంపేట్‌లో ఆలయం నిర్మించడంతో సంతోషకరం అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ముందుకు తీసుకెళ్లేందుకు ఆలయ నిర్మాణం చేపడుతున్న నిర్వాహకులకు తమ సహకారం ఉంటుందన్నారు. ఆలయ ఏర్పాటు ఇక్కడి ప్రజల అదృష్టం అన్నారు. ఇక్కడి నుంచి కేదార్‌నాథ్‌ వరకు వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం ఆలయం నిర్మిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూజల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, మేడ్చల్‌ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్‌, కాంగ్రెస్‌ నేతలు నక్కా ప్రభాకర్‌గౌడ్‌ కుమార్‌యాదవ్‌, రామకృష్ణుడు, ఆలయ నిర్వాహకులు జైపాల్‌సింగ్‌, రామ్‌ బాటియా, చెన్నారం చౌదరి, అశోక్‌ బాటియ, పవన్‌, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

విహారయాత్రకు వెళ్లి.. విగతజీవిగా మారి...



మృతుడు జగదీశ్‌ (ఫైల్‌), జగదీశ్‌ మృతదేహం

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ మండలం చౌదరిగూడ మక్త గ్రామంలో బుధవారం ఏకాదశి పర్వదినాన విషాదఛాయలు అలుముకున్నాయి. అదే గ్రామానికి చెందిన ఫైనాన్సియర్‌ చింతపండు జగదీశ్‌(42) అనుమానాస్పదస్థితిలో మరణించాడు. బంధువులు తెలిపిన వివరాలు... మక్తకు చెందిన నరేశ్‌నాయక్‌, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి జగదీశ్‌ దేవరకద్ర మండలం నాగార్జునసాగర్‌ బ్యాక్‌ వాటర్‌ ప్రాంతమైన వైజాగ్‌ కాలనీకి మంగళవారం సాయంత్రం విహారయాత్రకు వెళ్లారు. అందులో ముగ్గురు రాత్రి మద్యం సేవించారు. మరునాడు ఉదయం మిత్రులు నిద్రలేచేసరికి సమీపంలోని నీటిలో జగదీశ్‌ మరణించి ఉన్నాడు. జాలర్ల సమాచారం మేరకు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. విహారయాత్రకు వెళ్లినవారిలో ఓ స్నేహితుడు జగదీశ్‌ వద్ద ఫైనాన్స్‌ తీసుకున్నాడని, డబ్బులు అడిగితే చంపేశారని, మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

- గ్రామాలు, మున్సిపాలిటీల్లో వీధి కుక్కల బెడద
- కాలనీల్లో స్వైర విహారం
- చిన్నారులు, వాహనదారులపై దాడులు
- పలువురికి గాయాలవుతున్నా పట్టించుకోని వైనం
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం


కీసర బంగారు మైసమ్మ కాలనీ సమీపంలో గుంపుగా ఉన్న వీధి కుక్కలు

కీసర: మండల కేంద్రమైన కీసరతోపాటు, వివిధ గ్రామాల్లో, నాగారం దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ అధికం అవుతోంది. గ్రామంలోని ఏకాలనీలో చూసినా పదుల సంఖ్యలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. జవహర్‌నగర్‌లో చోటుచేసుకున్న వీధికుక్కలు చిన్నారిపై దాడి చేసి ఈడ్చుకెళ్లి చంపిన ఘటన నేపథ్యంలో వీధికుక్కలు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోననే భయాందోళనలు సర్వత్రా వ్యక్తం అవుతోంది. వీధికుక్కల వల్ల పాఠశాలలకు వెళ్లే చిన్నారులతోపాటు ఇళ్ల ముందు ఆడుకునే చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో వీధి కుక్కల దాడిలో పలువురు గాయపడిన సంఘటనలు చాలానే ఉన్నాయి. సమస్యను పంచాయతీ, మున్సిపల్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఏమాత్రం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలలో వీధికుక్కల నియంత్రణకు మున్సిపల్‌ ఆధ్వర్యంలో, బ్లూక్రాస్‌ సొసైటీ సహకారంతో చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో వాటి బెడద తగ్గించలేకపోతున్నారు. వివిధ కాలనీల్లో ఒంటరిగా వెళ్లే వ్యక్తులపై తరచు వీధికుక్కలు దాడిచేసి గాయపరుస్తున్న సంఘటనలు రెండు మున్సిపాలిటీల్లో తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇకనైనా అధికారులు, పాలకులు పట్టించుకొని రెండు మున్సిపాలిటీలతోపాటు, కీసర మండలంలోని వివిధ గ్రామాల్లో వీధికుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

మద్యం దుకాణంలో అగ్నిప్రమాదం

అవుషాపూర్‌లో ఘటన • రూ. 28 లక్షలకు పైగా నష్టం


మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున పోలీసులు

ఘట్‌కేసర్‌: అవుషాపూర్‌ మద్యం దుకాణంలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. పోలీసుల సమాచారం మేరకు... అవుషాపూర్‌లో శ్రీనిధి మద్యం దుకాణం ఉంది. నిర్వాహకులు మంగళవారం రాత్రి 10 గంటలకు దుకాణాన్ని మూసివేశారు. అర్ధరాత్రి అనంతరం మద్యం దుకాణంలో మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులు, షాప్‌ యజమానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, షాప్‌ నిర్వాహకులు సంఘటన స్థలానికి చేరుకొని ముందుగా విద్యుత్‌ సరఫరాను బంద్‌ చేశారు. అనంతరం ఫైర్‌ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దుకాణంలోని మద్యం సీసాలు, ఫ్రిజ్‌లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. బుధవారం ఉదయం ఎక్సైజ్‌ ఎస్‌ఐ నళిని సిబ్బందితో కలిసి దుకాణాన్ని పరిశీలించారు. విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగానే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. దుకాణంలో సుమారు రూ. 60 లక్షల పైగా మద్యం నిల్వ ఉందని తెలిపారు. మద్యంతో పాటు కౌంటర్‌లోని నగదు, సీసీ కెమరాలు, హార్డ్‌ డిస్కులు, ఫ్రిజ్‌లతో కలిసి మొత్తం రూ. 28 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఎక్సైజ్‌ పోలీసులు తెలిపారు. దుకాణం నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రాజకీయంగా ఎదుర్కోలేక.. బంజారాలను ఉసిగొల్పుతున్నారు'


మాట్లాడుతున్న కౌన్సిలర్‌ రమాదేవి

ఘట్‌కేసర్‌: రాజకీయంగా ఎదుర్కోలేక బంజారాలను కొందరు తనపై ఉసిగొల్పుతున్నారని రెండో వార్డు కౌన్సిలర్‌ కొమ్మగోని రమాదేవి అన్నారు. పట్టణంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... ఎన్‌ఎఫ్‌సీ నగర్‌ బ్యూటీనెస్ట్‌ పార్కులో బంజారాలు ఏర్పాటు చేసిన శీతల దేవతా మూర్తులను మున్సిపల్‌ సిబ్బందితో తీసివేయించాననడం అవాస్తవమని అన్నారు. ఆ సంఘటనకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తన ఎదుగుదల చూసి ఓర్వలేక గిట్టని వాళ్లు దురుద్దేశంతో బంజారాలతో తనపై కేసు పెట్టించారన్నారు. బంజారాలు వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. తనకు సంబంధం లేని విషయంలో ఇరికించి అభాండాలు వేసి ఇబ్బంది పెట్టడం, మహిళా కౌన్సిలర్‌గా మానసిక ఆవేదనకు గురి చేయడం సరికాదన్నారు.

గరుడాళ్వార్‌కు వెండి కవచం


వెండికవచాన్ని ఈవోకు అందజేస్తున్న వెంకట సుబ్రహ్మణ్యం

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌ లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో గరుడాళ్వార్‌కు వసంతపురి కాలనీకి చెందిన భక్తుడు వెంకటసుబ్రహ్మణ్యం సుమారు 3.9 కిలోల వెండితో తయారు చేసిన వెండి కవచాన్ని విరాళంగా అందజేశారు. తొలి ఏకాదశి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి వెండి కవచాన్ని అలంకరించారు. ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు ఆయనను స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



మేడ్చల్‌లో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు, మేడ్చల్‌లో పీర్ల వద్ద కమిటీ సభ్యులు


కీసరలో మొక్కులు చెల్లించుకుంటున్న ముస్లింలు


రావల్‌కోల్‌లో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్‌యాదవ్‌ తదితరులు


ఘట్‌కేసర్‌లో...

మేడ్చల్‌: మొహర్రం పర్వదినాన్ని ముస్లింలు బుధవారం మేడ్చల్‌ మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాలలో కులమతాలకు అతీతంగా నిర్వహించారు. పీర్లకు పీర్ల చావడిలో ప్రార్థనలు చేసిన అనంతరం రెండు పట్టణాల వీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని ఊదు బెల్లం ప్రసాదంగా సమర్పించి దీవెనలు తీసుకున్నారు. 10 రోజుల పాటు పండగను నిర్వహించారు. మేడ్చల్‌లోని ఇమామ్‌ ఖాసీం ఆషుర్‌ఖానా మేనేజింగ్‌ కమిటీ అధ్యక్షుడు ఖాజా ఖలీలుద్దీన్‌ ముస్లింలు నిర్వహించిన శర్బత్‌ పంపిణీ, అన్నదానం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పీర్ల ఊరేగింపులో కమిటీ సభ్యులు లాయక్‌ అలీ, ఖాజా మొయినుద్దీన్‌, రఫీక్‌, హుస్సేన్‌, జమాల్‌, ముక్తార్‌, కౌన్సిలర్‌ కొడే మహేష్‌, కోఆప్షన్‌ సభ్యుడు మహబూబ్‌ అలీ తదితరులు పాల్గొన్నారు.

కీసర పరిధిలో...

కీసర: మండలంలోని వివిధ గ్రామాలతోపాటు, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో బుధవారం పీర్లపండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. కీసరలో పెద్దలాల్‌బాబ్‌, చిన్నలాల్‌సాబ్‌, దూద్‌పీర్ల ఊరేగింపులో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కీసరలోని మసీదు వద్ద గ్రామస్తులు పెద్దలాల్‌సాబ్‌, చిన్నిలాల్‌సాబ్‌, దూద్‌పీర్లకుకు దట్టీలు కట్టిమొక్కలు చెల్లించుకున్నారు. సాయంత్రం మాతం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గుండ్లపోచంపల్లి పరిధిలో...

మేడ్చల్‌రూరల్‌: త్యాగానికి ప్రతీక అయిన మొహర్రంను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే పార్థనల అనంతరం గ్రామంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో పీర్లను ఊరేగించి, అసైదులా ఆటలు ఆడారు. గ్రామాల్లో ఆయా గ్రామాల నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో...

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌లో మొహర్రంను ముస్లింలు నిర్వహించారు. అంకుషాపూర్‌, ఘట్‌కేసర్‌, మర్పల్లిగూడ, ఎదులాబాద్‌, అవుషాపూర్‌లో హుస్సేన్‌, హుస్సేన్‌ను స్మరించుకుంటూ నివాళులర్పించారు. గ్రామాల్లో ఇంటింటికీ పీర్లను ఊరేగించారు. అందరికీ మంచి జరగాలని దట్టీలు సమర్పించారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి, కౌన్సిలర్‌ ఆంజనేయులుగౌడ్‌ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జాఫర్‌, పాషా, రమేశ్‌, ప్రణయ్‌రెడ్డి, సల్మాన్‌ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387